నేడు ప్రత్యేక పూజలు

కోహీర్, జనవరి 21: అయోధ్యలో శ్రీరాముడి విగ్రహ ప్రాణప్రతిష్ఠ వేడుకలను పురస్కరించుకొని పట్టణంలోని రామాలయంతో పాటు దిగ్వాల్ సీతారామాంజనేయ ఆలయం, ఆయా గ్రామాల ఆలయాల్లో సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. ఆలయాలు, ప్రధాన వీధులను కాషాయ తోరణాలతో అలంకరించారు. అయోధ్యలో బాల రాముడి విగ్రహ ప్రతిష్ఠ అనంతరం స్థానిక భక్తులకు అన్నదానం చేయనున్నారు.

వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలి

కోహీర్, జనవరి 21: పట్టణంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘం భవనంలో మంగళవారం ఉదయం 10నుంచి మధ్యాహ్నం 3వరకు కంటి వైద్య శిబిరం నిర్వహిస్తామని సంఘం అధ్యక్షుడు రత్నయ్య, పాపిరెడ్డి తెలిపారు. మెడివిజన్ దవాఖాన ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి ఆపరేషన్లు చేయిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు.

భద్రంగా ఇంటికి చేరాలి

కోహీర్, జనవరి 21: రోడ్డు నిబంధనలు పాటించి ప్రతిఒక్కరూ సురక్షితంగా తమ ఇండ్లకు చేరుకోవాలని ఎస్సై విఠల్ కోరారు. ఆదివారం భద్రత వారోత్సవాల సందర్భంగా మండలంలోని దిగ్వాల్ పిరమిల్ పరిశ్రమ వద్ద వాహనదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రతిఒక్కరూ హెల్మెట్ ధరించి వాహనాలను నడిపించాలని సూచించారు. మద్యం తాగి బైక్ నడపడం, రాంగ్‌రూట్‌లో వాహనాలను నడిపిస్తే ప్రమాదాలు జరిగే అవకాశం ఉంటుందన్నారు. నిబంధనలు పాటించి తమ ప్రాణాలను కాపాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎల్‌అండ్‌టీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

జహీరాబాద్, జనవరి 21: సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలల్లో ప్రవేశాలకు దరఖాస్తు గడువును ప్రభుత్వం పొడిగించినట్లు రంజోల్ బాలికల గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతిలో ప్రవేశాలకు ఉమ్మడి ప్రవేశ పరీక్షకు దరఖాస్తు గడువు ఈ నెల 23 వరకు పొడిగిస్తూ ఎస్సీ గురుకుల సొసైటీ నిర్ణయం తీసుకుందని చెప్పారు. ప్రవేశ పరీక్ష ఫిబ్రవరి 11న ఉదయం 11నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఉంటుందన్నారు. వివరాలకు రంజోల్ గురుకుల పాఠశాలలో సంప్రదించాలన్నారు.

గెలుపోటములు సహజం

నాగల్‌గిద్ద, జనవరి 21: క్రీడలతో స్నేహభావం పెంపొందుతుందని కాంగ్రెస్ జిల్లా నాయకుడు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి అన్నారు. సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కరస్‌గుత్తిలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఆదివారం ముగిసింది. విజేతగా నిలిచిన కారోభారి తండా జట్టుకు రూ. 21,111నగదు, రన్నర్‌గా నిలిచిన కేకే స్టార్ జట్టుకు రూ.11,111 అందజేశారు. కార్య క్రమంలో గ్రామపెద్దలు, నిర్వాహకులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులకు ప్రోత్సాహం

రాయికోడ్, జనవరి 21: గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారులను ప్రోత్సహిస్తానని వరం వైస్ చైర్మన్ తుకారం కురుమ అన్నారు. ఆదివారం రాయికోడ్ క్రికెట్ క్రీడాకారులకు అవసరమైన దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన సొంత నిధులతో రూ. 20వేలు వెచ్చించి దుస్తులను పంపిణీ చేసినట్లు తెలిపారు. మండలంలోని ఉన్న క్రీడాకారులకు తన వంతుగా ఆర్థిక సాయం చేస్తానని తెలిపారు.

చెలరేగిన మంటలు

జిన్నారం, జనవరి 21: వావిలాల అటవీ ప్రాంతంలో ఆదివారం మంటలు చెలరేగాయి. మధ్యాహ్నం ఒంటిగంట సమయంలో రోడ్డు వైపు నీలగిరి చెట్లు ఉన్న ప్రాంతంలో మంటలు ఏర్పడటంతో క్రమంగా దట్టమైన పొగలు, మంటలు చెలరేగాయి. రోడ్డును మొత్తం పొగలు కమ్మేయడంతో వాహనాదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎదురుగా వచ్చే వాహనాలు కనిపించకపోవడంతో చాలా సేపు వాహనాలు ఆపారు. మంటలకు నీలగిరి చెట్లు దెబ్బతిన్నాయి. ఎవరో కావాలని మంటలు అంటించారని ప్రయాణికులు తెలిపారు. అధికారులు ఇలాంటి ఘటనలపై అవగాహన కల్పించి అడవులను రక్షించాలని కోరారు.

వైద్యానికి భరోసా

రామచంద్రాపురం, జనవరి 21 : ఆర్సీపురం డివిజన్‌లోని శ్రీనివాస్‌నగర్ కాలనీకి చెందిన బీఆర్ఎస్ నాయకుడు బీకే యాదయ్యకు కాలు ఇన్ఫెక్షన్‌తో కొంతకాలంగా బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆర్సీపురం మాజీ సర్పంచ్ రాజేశ్వర్‌రెడ్డి, కార్పొరేటర్ సింధూఆదర్శ్‌రెడ్డి ఆదివారం వారి నివాసంలో బీకే యాదయ్యకు చికిత్స కోసం రూ. 25వేలు ఆర్థిక సాయం అందజేశారు.

ముక్కు మూసుకుంటేనే కట్టదాటేది!

- కాలుష్య సారంగా అయ్యమ్మ చెరువు
- దుర్వాసన వెదజల్లుతున్న పరిసరాలు
- చెరువులోకి పరిశ్రమల వ్యర్థాలు, డ్రైనేజీ నీళ్లు
- ఇబ్బందులు పడుతున్న సమీప ప్రజలు

రసాయన వ్యర్థాలు, డ్రైనేజీ నీరు చేరడంతో కలుషితమైన గడ్డపోతారం అయ్యమ్మ చెరువు

జిన్నారం, జనవరి 21: గడ్డపోతారం పంచాయతీ పరిధిలోని చెరువు, కుంటలు కాలుష్యం బారిన పడ్డాయి. ముప్పై ఏండ్ల క్రితం తాగు, సాగునీటికి ఉపయోగపడిన జలవనరులు నేడు రసాయన వ్యర్థాలకు నిలయంగా మారాయి. దీంతో నీటిని ఏ అవసరాలకు వినియోగించలేని దుస్థితి. చెరువు పైభాగంలోని పరిశ్రమల నుంచి వెలువడే రసాయన వ్యర్థాలకు తోడు డ్రైనేజీనీరు అయ్యమ్మ చెరువులోకి వచ్చి చేరుతున్నది. అయ్యమ్మ చెరువు కట్ట పై నుంచి పారిశ్రామికవాడకు రోజూ వందల వాహనాలు తిరుగుతుంటాయి. చెరువు కట్ట ప్రారంభం కాగానే ముక్కు మూసుకుంటేనే కట్టదాటే పరిస్థితి. కార్మికులు ఊపిరి బిగపట్టి పనులకు వెళ్లాల్సిన దుస్థితి ఏర్పడింది.

పదేండ్లుగా కలుషితం

పదేండ్ల క్రితం ప్రత్యేకంగా డ్రైనేజీ పైపులైన్‌ను అయ్యమ్మ చెరువులోకి వేశారు. ఫలితంగా ముక్కుపుటాలు అదిరేలా దుర్గంధం వ్యాపిస్తున్నదని చెరువు సమీప ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. చెరువులోకి అల్లీనగర్, ప్రశాంత్ నగర్, గడ్డపోతారం, చెట్లపోతారం గ్రామాలకు చెందిన డ్రైనేజీ నీరు కలుస్తున్నది. చెరువులోకి డ్రైనేజీ నీరు రాకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలని, చెరువును శుద్ధి చేసి రసాయన వ్యర్థాలు చేరకుండా చర్యలు తీసుకోవాలని వేడుకుంటున్నారు.

చెరువును కాపాడుకుంటాం

గడ్డపోతారం పంచాయతీలోని అయ్యమ్మ చెరువులోకి రసాయన వ్యర్థాలు, డ్రైనేజీ నీళ్లు వస్తున్నాయి. దీంతో చెరువు పూర్తిగా కలుషితమైంది. చెరువులోకి డ్రైనేజీ నీళ్లు రాకుండా చర్యలు చేపట్టాం. పరిశ్రమల నుంచి రసాయన వ్యర్థాలు రాకుండా కట్టడికి ప్రయత్నాలు చేస్తున్నాం. ఈ రెండు సఫలమైతే అయ్యమ్మ చెరువుకు పూర్వ వైభవం వస్తుంది.

– పులిగిల్ల ప్రకాశ్‌చారి, గడ్డపోతారం సర్పంచ్

కుటుంబసమేతంగా కొలువు తీరిన కల్యాణ రామచంద్రస్వామి

దక్షిణాదిలోనే ఏకైక కల్యాణ రామచంద్రస్వామి ఆలయం

గుమ్మడిదల, జనవరి 21 : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండల కేంద్రంలో రాంనగర్‌కాలనీలో గుట్టపై భక్తుల కోరిన కోర్కెలను తీర్చే కొంగుబంగారంగా పూజలందుకుంటున్నారు. దాదాపు వెయ్యి ఏండ్ల చరిత్ర కలిగిన కల్యాణ రామచంద్రస్వామి తన సోదరసమేతంగా వెలిశారు. ప్రతి సీతారామచంద్రస్వామి ఆలయంలో హనుమంతుడు శ్రీరాముడి పక్కనే ఉంటాడు. కానీ, శ్రీరాముడి కల్యాణ సమయంలో హనుమంతుడు లేకపోవడంతో ఈ దేవాలయంలో హనుమంతుడు లేకపోవడం విశేషం. ఆలయంలో శ్రీరాముడు సీతా సమేతంగానే కాక లక్ష్మణుడు ఊర్మిళ, భరతుడుమాండవి, శత్రుఘ్నుడు శ్రుతకీర్తి దేవేరులతో స్వామి వారు కుటుంబ సమేతంగా భక్తులకు దర్శనమిస్తున్నారు. ఏటా శ్రీరామనవమిని పురస్కరించుకుని నాలుగు రోజులపాటు వేడుకలు అత్యంత వైభవంగా ఆలయవంశ పార్యపరంకులు కేవీ.రామానుజచార్యులు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నారు. జిల్లా నలుమూలల నుంచి కాక ఇతర రాష్ట్రాల నుంచి వచ్చి స్వామి వారిని దర్శించుకుంటారు.

పటాన్‌చెరు అభివృద్ధే ధ్యేయం

- ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి
- ఆరు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు

జిన్నారం, జనవరి 21: నియోజకవర్గంలోని పట్టణాలు, మున్సిపాలిటీలు, గ్రామాల అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ప్రజల సహకారం, ప్రజాప్రతినిధుల ప్రణాళికలకు అనుగుణంగా రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. మండలంలోని అండూరు, సోలక్‌పల్లి, ఊట్ల, జిన్నారం, గడ్డపోతారం గ్రామాలలో రూ.2.35కోట్లతో నిర్మించిన సీసీరోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, మినీ స్టేడియాన్ని ప్రారంభించారు. గడ్డపోతారంలో హెటిరో పరిశ్రమ సీఎస్ఆర్ నిధులతో రూ. 2.70కోట్లతో నూతనంగా నిర్మించిన పంచాయతీ భవనాన్ని ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. అనంతరం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గడ్డపోతారంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వం అందించే నిధులతో పాటు సీఎస్ఆర్ ద్వారా వచ్చే నిధులు గ్రామాలకు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతామన్నారు. అంతకుముందు ఆయా గ్రామాల్లో సర్పంచులు, ఉపసర్పంచులు, నాయకులు ఎమ్మెల్యేను శాలువా, పూలమాలతో సన్మానించారు. గడ్డపోతారంలో మినీ స్టేడియాన్ని ప్రారంభించి క్రీడాకారులతో కలిసి ఎమ్మెల్యే క్రికెట్ ఆడారు.

కార్యక్రమంలో జడ్పీవైస్ చైర్మన్ ప్రభాకర్, బీఆర్ఎస్ జిల్లా నాయకుడు వెం కటేశంగౌడ్, సర్పంచులు ప్రకాశ్‌చారి, చెట్టి శివరాజ్, ఖదీర్, కొరివి ఆంజనేయులు, శ్రీకాంత్‌రెడ్డి, రేఖా కృష్ణ, లావణ్యాశ్రీనివాస్‌రెడ్డి, ఎంపీటీసీలు స్వాతీప్రభాకర్‌రెడ్డి, ఆకుల భార్గవ్, జనాబాయి, సంతోషామహేశ్, ఉప సర్పంచులు మమతాపెంటేశ్, సంజీవ, రవీందర్, వనజా కృష్ణారెడ్డి, అభిలాశ్‌గౌడ్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రాజేశ్, హెటిరో పరిశ్రమ డైరెక్టర్లు మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రవిబాబు, సీఎస్ఆర్ ప్రతినిధి సుధాకర్, రఘునాథ్, మాజీ ఎంపీటీసీ బాశెట్టిరాజు, మాజీ సర్పంచ్ నీరుడి శ్రీనివాస్, వేణుగోపాల్, సంధ్యగారి నర్సింగ్ రావు, సార నరేందర్, ప్రభాకర్‌రెడ్డి, నాగరాజు, రామకృష్ణ, లక్ష్మణ్‌రావు, ఎన్‌కుమార్, బీమ్‌రావు, గణేశ్, ఈవో వెంకట్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గడ్డపోతారం పంచాయతీ ఆవరణలో ఏర్పాటు చేసిన గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి, ప్రజాప్రతినిధులు

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

నారాయణఖేడ్, జనవరి 21 : అనారోగ్యంతో దవాఖానలో చికిత్స పొందిన పట్టణానికి చెందిన నాగన్నకు సీఎంఆర్ఎఫ్ కింద మంజూరైన రూ.42,500 చెక్కును మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో నారాయణఖేడ్ బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నగేశ్ సేట్, గొల్లకురుమ నియోజకవర్గ అధ్యక్షుడు సాయి ప్రభుయాదవ్ ఉన్నారు.

నాగన్నకు సీఎంఆర్ఎఫ్ చెక్కును అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి

ఉద్యోగులకు క్రీడా పోటీలు

రామచంద్రాపురం, జనవరి 21: వివిధ కార్పొరేట్ కంపెనీల ఉద్యోగులకు క్రీడాపోటీలను నిర్వహించారు. తెల్లాపూర్ మున్సిపాలిటీలోని మేరు ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఈ క్రీడాపోటీలు జరిగాయి. క్రీడాకారుల కు బ్యాడ్మింటన్, బాక్స్‌క్రికెట్, ఫుట్‌బాల్ తదితర క్రీడలను నిర్వహించారు. రెండు రోజులపాటు జరిగిన ఈ క్రీడా పోటీల్లో వివిధ కార్పొరేట్ కంపెనీలకు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు పాల్గొన్నారు. విజేతలకు స్కూల్ మేనేజ్‌మెంట్ ప్రతినిధులు మెడల్స్‌ని అందజేశారు.

సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన

అమీన్‌పూర్, జనవరి 21: అమీన్‌పూర్ మున్సిపల్‌లోని 3వ వార్డు శ్రీవాణినగర్ కాలనీలో రూ. 81లక్షలతో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులకు మున్సిపల్ చైర్మన్ తుమ్మల పాండు రంగారెడ్డి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నర్సింహ గౌడ్, కమిషనర్ జ్యోతిరెడ్డి, కౌన్సిలర్ కల్పనా ఉపేందర్‌రెడ్డి, బోయిని బాలమణిబాలరాజు, కో-ఆప్షన్ సభ్యుడు తలారి రాములు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

కేతకీలో ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు ప్రత్యేక పూజలు

ఝరాసంగం, జనవరి 21 : దక్షిణకాశీగా ప్రసిద్ధిచెందిన కేతకీ సంగమేశ్వర స్వామి దేవాలయాన్ని ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ అభ్యర్థి బల్మూర్ వెంకట్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆదివారం గర్భగుడిలోని పార్వతీ సమేత సంగమేశ్వర స్వామికి మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం అర్చకులు ఎమ్మెల్సీ అభ్యర్థిని శాలువాతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట ఆలయ అధికారులు రమేశ్, వీరన్నలు, కాంగ్రెస్ రాష్ట్ర యువజన ఉపాధ్యక్షులు రాజీవ్‌రెడ్డి, నల్ల ప్రతాప్‌రెడ్డి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి హర్షవర్ధన్ రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి మల్లి మల్లికార్జున్, నాయకులు సంగన్న, రుద్రయ్యస్వామి, నాగిరెడ్డి, శివసాయి ఉన్నారు.



కేతకీలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్సీ అభ్యర్థి బల్మూరు వెంకట్

పద్మశాలీల సంక్షేమానికి పెద్దపీట

పద్మశాలీ సంఘం స్వర్ణోత్సవ సమ్మేళనంలో పాల్గొన్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

రామచంద్రాపురం, జనవరి 21 : పటాన్‌చెరు నియోజకవర్గంలోని పద్మశాలీ కులస్తుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి అన్నారు. ఆదివారం భెల్‌లోని పెద్దమ్మ ఆలయం సమీపంలో భెల్ పద్మశాలీ సంఘం 50 ఏండ్లు పూర్తిచేసుకున్న సందర్భంగా స్వర్ణోత్సవ సమ్మేళనం కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత రంగానికి ఊపిరిలూదిన గొప్ప నాయకుడు తొలి తెలంగాణ సీఎం కేసీఆర్ అని అన్నారు.

నియోజకవర్గంలో పద్మశాలీల అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. మూడోసారి ఎమ్మెల్యేగా విజయం సాధించడంలో పద్మశాలీ కులస్తుల సహకారం మరువలేనిదన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్పానగేశ్, రాగం నాగేందర్, నాయకులు ఆదర్శ్‌రెడ్డి, వంగరి అశోక్, మల్లేశ్, సంఘం అధ్యక్షుడు రమేశ్, నారాయణ, సోమదాసు ఉన్నారు.

సంగారెడ్డిలో ఇద్దరు అదృశ్యం

కంది, జనవరి 21 : ఇద్దరు వ్యక్తులు వేర్వేరుగా అదృశ్యమైన ఘటన ఆదివారం సంగారెడ్డి పట్టణంలో జరిగింది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ శ్రీధర్‌రెడ్డి తెలిపారు. సంగారెడ్డి పట్టణం ప్రగతినగర్‌లో నివాసం ఉంటున్న రాథోడ్ గంసిబాయి ఈ నెల 20న కూలీ పని కోసం అడ్డమీదకి వెళ్తానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. దీంతో భర్త దశరథ్ బంధువులు, వివిధ చోట్ల వెతికినా జాడ లేకపోవడంతో ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంగారెడ్డి మార్క్స్‌నగర్‌కు చెందిన రాథోడ్ హిరామన్ ఈ నెల 20న మేస్త్రీ పని నిమిత్తం ఇంటి నుంచి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో కుటుంబ సభ్యులు తెలిసిన చోట వెతికిన ఆచూకీ లేకపోవడంతో అతని భార్య సంగీత రాథోడ్ సంగారెడ్డి పట్టణ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. సమాచారం తెలిసిన వారు 08455-276333కు సమాచారం ఇవ్వాలని సీఐ కోరారు.

రాథోడ్ గంసిబాయి

రాథోడ్ హిరామన్

ఓటరు నమోదుకు దరఖాస్తులు

కోహీర్, జనవరి 21: మండలంలోని ఆయా గ్రామాల పోలింగ్ బూత్‌ల ఆవరణలో ఆదివారం బీఎల్వోలు ఓటరు నమోదుకోసం దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తుల స్వీకరణను ఆర్ఐ సత్యనారాయణ, సూపర్‌వైజర్లు మాన్‌సింగ్ పరిశీలించారు. కార్యక్రమంలో బీఎల్వోలు పాల్గొన్నారు.

దరఖాస్తుల స్వీకరణ

జహీరాబాద్, జనవరి 21 : 18 ఏండ్లు నిండిన ప్రతిఒక్కరికీ దరఖాస్తు స్వీకరించాలని ఆర్డీవో వెంకారెడ్డి బీఎల్వోలకు సూచించారు. ఆదివారం పట్టణంలోని పలు పోలింగ్ బూత్‌లో కొత్త ఓటరు దరఖాస్తులు, మార్పులు, చేర్పుల దరఖాస్తుల సేకరణ తీరును పరిశీలించి పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో తహసీల్దార్ రవీందర్, ఆర్ఐ రుక్మాద్దీన్, జైపాల్‌రెడ్డి, బీఎల్వోలు పాల్గొన్నారు.

ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలు తనిఖీ

బొల్లారం, జనవరి 21 : బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని ఆయా పోలింగ్ కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు శిబిరాలను మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి తనిఖీ చేశారు. తెలంగాణ ఆదర్శ పాఠశాలలోని 75, 76, 77, 78, 79 పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియ జరుగుతున్న తీరును పరిశీలించారు. బీఎల్వోలు ఓటరు నమోదు కార్యక్రమ లక్ష్యాన్ని పూర్తిచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్వో శ్రీధర్, మేనేజర్ నిర్మల, బీఎల్వోలు, సిబ్బంది పాల్గొన్నారు.



పోలింగ్ కేంద్రాన్ని తనిఖీ చేసిన మున్సిపల్ కమిషనర్ సంగారెడ్డి

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి

చౌటకూర్, జనవరి 21: అర్హులైన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలని అందోల్ ఆర్డీవో పాండు కోరారు. ఆదివారం మండలం కేంద్రంలో పోలింగ్ బూత్‌లో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందోల్ నియోజకవర్గంలోని 313 పోలింగ్ బూత్‌లో శని, ఆదివారాల్లో చేపట్టిన ఓటరు నమోదు కార్యక్రమంలో 959మంది దరఖాస్తు చేసుకున్నట్లు తెలిపారు. చిరునామా, పోలింగ్ బూత్‌లు మార్పుల కోసం 229 మంది దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు. ఈ నెల 25న జాతీయ ఓటరు దినోత్సవాన్ని నియోజకవర్గ వ్యాప్తంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమలో అందోల్ తహసీల్దార్ ఆంథోని డియోనిసియా, చౌటకూర్ తహసీల్దార్ ఈశ్వరీరాణి పాల్గొన్నారు.

ఓటరు నమోదుపై స్పెషల్ డ్రైవ్

జిన్నారం, జనవరి 21 : ఓటరు నమోదు కార్యక్రమంపై రెవెన్యూ అధికారులు స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. మండలంలో జరుగుతున్న ఓటరు నమోదు కార్యక్రమాలను తహసీల్దార్ రవికుమార్ ఆదివారం సందర్శించారు. బీఎల్వోలకు ఓటరు నమోదుపై పలు సలహాలు, సూచనలు ఇచ్చారు. జిన్నారం పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన ఓటరు నమోదు కార్యక్రమాన్ని తహసీల్దార్ సందర్శించారు.

జహీరాబాద్ : కొత్త ఓటరు నమోదు కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న ఆర్డీవో వెంకారెడ్డి

జిన్నారం : ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ రవికుమార్

మున్సిపల్ కార్మికుల వేతనాలు చెల్లించాలి

కంది, జనవరి 21: సంగారెడ్డి మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల వేతనాలు వెంటనే చెల్లించాలని సీఐటీయూ జిల్లా నాయకులు యాదగిరి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం సంగారెడ్డిలోని సుందరయ్య భవన్ మున్సిపల్ కార్మికులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా యాదగిరి మాట్లాడుతూ వేతనాలు రాక కార్మికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్ట్ కార్మికులను రెగ్యులర్ చేయాలని, 11వ పీఆర్సీ చైర్మన్ చేసిన సిఫార్సు చేసిన కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం స్పందించి కార్మికుల సమస్యల పరిష్కరించాలని, లేకపోతే విధులు బహిష్కరించి ఆందోళ చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మున్సిపల్ కాంట్రాక్ట్ కార్మికుల యూనియన్ నాయకులు సువర్ణ, లక్ష్మి, మంజుల, మల్లేశం, లక్ష్మణ్, వినోద్ పాల్గొన్నారు.

నిబంధనల మేరకు మద్యం విక్రయించాలి

జహీరాబాద్, జనవరి 21: ప్రభుత్వ నిబంధనల మేరకు మద్యం విక్రయించాలని, అధిక ధరలకు విక్రయిస్తే వ్యాపారులపై కేసులు నమోదు చేస్తామని ఉమ్మడి జిల్లా ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ సీఐ రజిత హెచ్చరించారు. ఆదివారం పట్టణంలోని పలు వైన్స్‌షాపులు తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు. ప్రభుత్వం సరఫరా చేసే మద్యాన్ని విక్రయించాలని, అధిక ధరల కు విక్రయిస్తే షాపు లైసెన్స్ రద్దు చేస్తామని తెలిపారు. తనిఖీలో ఎక్సైజ్ ఎస్సై అనిల్, సిబ్బంది పాల్గొన్నారు.

పాత కక్షలతో వ్యక్తి హత్య : నిందితుడి అరెస్టు

రాయికోడ్, జనవరి 21 : పాత కక్షలతో ఓ వ్యక్తిని హత్య చేసిన ఘటన మండలంలో జరిగింది. ఆదివారం జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. శనివారం సాయంత్రం మండలంలోని సింగితం గ్రామంలో ఎస్సీ కమ్యూనిటీ భవనం వద్ద కర్చల్ రవి, అదే గ్రామానికి చెందిన అలిగే రాజు గొడవ పడ్డారు. అలిగే రాజు ఆవేశంతో తన ఇంట్లో నుంచి కమ్మ కత్తి తీసుకొచ్చి రవి మెడ, ముఖం, తలపై బలంగా కొట్టాడు. రవిని చిక్సిత కోసం జహీరాబాద్ ప్రభుత్వ దవాఖానకు తరలించగా, డాక్టర్లు మెరుగైన చిక్సిత కోసం హైదరాబాద్‌కు రిఫర్ చేశారు.

నగరానికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. మృతుడి తమ్ముడు శ్రీనివాస్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి నిందితుడు అలిగే రాజును అరెస్టు చేసి రిమాండ్ పంపారు. సమావేశంలో ఎస్సై వెంకట్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

రాయికోడ్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడిస్తున్న జహీరాబాద్ రూరల్ సీఐ వెంకటేశం